క్లుప్తంగా

జీజీహెచ్‌కు వీల్ చైర్స్ బహూకరణ



గుంటూరు మెడికల్: ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రికి రూ.25 వేల విలువ చేసే వీల్ చైర్స్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జూనియర్ వైద్యుల సేవలు అద్భుతంగా ఉన్నాయని చెప్పారు. రూ.25 వేల విలువ చేసే వీల్ చైర్స్ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి డాక్టర్ అఖిల్, డాక్టర్ జి.హరినాథ్ పాల్గొన్నారు.

ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ ఉచితంగా ప్రింట్ తీసి ఇస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మత్తయ్య తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని యూనియన్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో మత్తయ్య మాట్లాడుతూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లు సర్టిఫికెట్ కోసం వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింకు అయిన మొబైల్ ఫోన్ తీసుకు రావాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాదరావు, వెంకటేశ్వరరావు, కోశాధికారి సైదులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కుంభా ఆదినారాయణరావు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జీజీహెచ్‌లో నిర్వహించనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, ఆర్థిక శాఖ పే అకౌంట్స్ అధికారి కె.సురేష్, దాసరి జోసఫ్, డాక్టర్ జాని పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిత్యపూజలు



నెహ్రూనగర్: అయిసెట్టి సీతారామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం స్థానిక నెహ్రూనగర్ 6వ లైనులో శ్రీలక్ష్మీనారాయణ స్వామి అఖండ స్థాపన, నిత్యపూజలు ప్రారంభయ్యాయి. కార్యక్రమానికి తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, 56వ డివిజన్ కార్పొరేటర్ అయిసెట్టి కనకదుర్గ పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అయిసెట్టి శ్రీనివాస్(మార్కెట్ శ్రీను), వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పిన్నమనేనికి సత్కారం



పెదకాకాని: స్థానిక గంగా భ్రమరాంబా సమేత చంద్రశేఖర స్వామివారి 81వ ఆర్ద్రా మహోత్సవాలు ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో ఐదు రోజుల పాటు జరిగే ఈ పూజా కార్యక్రమాల ముగింపు సభలో ఉత్తమ నాటక రచయితగా బంగారు నంది అందుకున్న పిన్నమనేని మృత్యుంజయరావును కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

అక్షింతల వితరణ

గుంటూరు మెడికల్: అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతల వితరణ కార్యక్రమం సోమవారం స్థానిక సీతారామదేవాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరిఫాతిమా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, టీడీపీ ఇన్‌చార్జి నసీర్ అహ్మద్, వికాస తరంగిణి నాయకులు లగడపాటి రామలక్ష్మమ్మ పాల్గొన్నారు. సుమారు 300 గృహాలకు అక్షింతల వితరణ చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

నగరంలో న్యూ ఇయర్ వేడుకలు
- ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు అందజేసిన కార్యకర్తలు
- జిల్లా అధికారులకు పుష్పగుచ్ఛాలు అందజేసిన ఉద్యోగులకు



మంత్రి విడదల రజినికి శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్



ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నాయకులు

గుంటూరు మెడికల్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి మంత్రికి వివరించారు. అదే విధంగా 20 పడకల ఐసీయూ నిర్మాణం పూర్తి కావస్తుందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

గుంటూరు వెస్ట్: న్యూఇయర్ పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్ దంపతులు, జేసీ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, సోమవారం క్యాంపు కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు డీఆర్వో చంద్రశేఖర రావు, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు ఉన్నారు.

ఎస్ఎంఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు..

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ టైంస్కేల్ ఎస్ఎంఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడులు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య పి రాజశేఖర్ కట్ చేసి ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి జి.అంజమ్మ, పి.ప్రసాద్, డి.శ్రీనివాసరావు, శివయ్య, వెంకటేశ్వరరావు, రాంబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం: నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నూతన సంవత్సరంలో నగరాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు కలిసి కట్టుగా పనిచేద్దామని నగర కమిషనర్ కీర్తి చేకూరి చెప్పారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ప్రజారోగ్యధికారులు కమిషనర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో...

నెహ్రూనగర్: తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొని కేక్ కట్ చేశారు. కార్పొరేటర్లు, మిర్చి యార్డు డైరెక్టర్లు, నియోజకవర్గం పరిధిలోని దేవస్థానం చైర్మన్లు, కమిటీ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు వేడుకల్లో పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు అందజేశారు.



కేక్ కట్ చేస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, పక్కన ఉద్యోగ సంఘ నాయకులు



నగర కమిషనర్ కీర్తికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి



జీడీసీసీ బ్యాంకులో నిర్వహించిన వేడుకల్లో చైర్మన్ రాము తదితరులు

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్రకుమార్

గుంటూరు మెడికల్: రాష్ట్ర అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని బీజేపీ గుంటూరు తూర్పు అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో తూర్పు అసెంబ్లీ ఎనిమిది మండలాలకు నూతన అధ్యక్షుల ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ఒకటి నుంచి ఎనిమిది మండలాలకు అధ్యక్షులుగా వరుసగా కామరాజు దుర్గాప్రసాద్, తోకల పురుషోత్తం, మద్ది బ్రిజేష్, బోడాబత్తుల రామకృష్ణ, కొలకలూరి శ్రీనివాసరావు, సురేష్‌జైన్, తిరువల్లూరు వెంకటరమణ, యరవ శ్రీనివాసరావులను నియమించారు. ఈసందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రధాని తీసుకున్న సహసోపేతమైన నిర్ణయాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు అసెంబ్లీ కో కన్వీనర్ షేక్ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, పద్మనాభం, మేరి సరోజని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్రకుమార్

సూపరింటెండెంట్ క్యాంపు కార్యాలయం ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలోని నాట్కో కేంద్రంలో సూపరింటెండెంట్ క్యాంపు ఆఫీస్, ట్యూమర్ బోర్డు మెంబర్స్ రూమ్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నాట్కో కేంద్రంలో పర్యవేక్షణ అవసరమని గుర్తించి మూడో ఫ్లోర్‌లో క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించామని చెప్పారు. క్యాన్సర్ రోగుల ఆరోగ్యం విషయంలో అని విభాగాలు వైద్యుల పర్యవేక్షణ కోసం రూమ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, క్యాన్సర్ వైద్య నిపుణులు దుర్గా ప్రసాద్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ వెంకట రెడ్డి, యడ్లపాటి అశోక్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా విద్యాసంవత్సరం పొడవునా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ విద్యార్థులను చదువుతో పాటు క్రీడలు, ఆటల్లో ప్రోత్సహించడం ద్వారా నైపుణ్యాలను వెలికితీస్తున్నట్లు తెలిపారు. కో-కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొనడం ద్వారా జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ కొత్త ఏడాది సందర్భంగా మంచి ఆలోచనలు, మంచి భావాలతో ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో కె.వెంకట్రావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో రథినీచౌదరి

తులసి గ్రూప్ ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడుకలు

కొరిటిపాడు: 2024 నూతన ఆంగ్ల సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకుని తులసి గ్రూప్ యాజమాన్యం ఆధ్వర్యంలో అరండల్ పేట లోని 'యోగి భవన్' లో వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరయ్యారు. తొలుత ప్రభు భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా రామచంద్ర ప్రభు మాట్లాడుతూ రైతు సోదరులు, ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడి పంటలు సంవృద్ధిగా ఉండాలని నూతన సంవత్సరం అందరికీ సరికొత్త భవిష్యత్ ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. జిడుగు సుబ్బారావు ఆధ్వర్యంలో కర్రసాము విన్యాసాలు చేసిన విద్యార్థులను ప్రభు అభినందించారు. కార్యక్రమంలో పలువురు నూతన సంవత్సర డైరీ, కేలండర్లు తులసి ప్రభు చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ఏటుకూరు మాజీ సర్పంచి ఉగ్గిరాల సీతారామయ్య, జనసేన కార్పొరేటర్ దాసరి లక్ష్మి దుర్గ, వాసు, దాసరి రవి, కె.వెంకటేశ్వరరావు, కన్నా మార్కండేయులు, ఉగ్గిరాల అంకమ్మరావు, పసుపులేటి రమణయ్య, షేక్ ఖాశిం, తోటకూర వీరబాబు, శ్రీనివాస మోహన్, దళవాయి సుబ్రహ్మణ్యం, కనకం నరసింహారావు, తిరుమలశెట్టి రమేష్, తోట శ్రీనివాస్, వివేకానంద శ్రీనివాసరెడ్డి, కాసా కిషోర్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న తులసి రామచంద్ర ప్రభు

మంత్రి కార్యాలయంపై దాడికి బీజేపీ ఖండన

గుంటూరు మెడికల్: గుంటూరు పట్టణంలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కార్యాలయంపై దాడిని బీజేపీ అధికార ప్రతినిధి వి.పాండురంగ విఠల్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో సిద్ధాంతపరమైన విభేదాలు ఉండవచ్చు కాని, ఇలాంటి భౌతిక దాడి చేయడం అనాగరిక చర్య అని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఏ పార్టీ వారైన ఇలాంటి దాడులు చేయడం వలన ప్రజల్లో వారే పలచబడతారని హెచ్చరించారు.

అక్రమ మద్యం పట్టివేత

గుంటూరు రూరల్ : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విక్రయదారుడిని వట్టిచెరుకూరు మండల ఎస్సై కోటేశ్వరరావు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామానికి చెందిన మన్నవ శివానంద అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నాడన్న ఎస్‌బీ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడిచేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి ఆరు క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. చమళ్లమూడి గ్రామానికి చెందిన తడిపనేని రామోహన్ రావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 31 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలుడి అప్పగింత

తాడేపల్లిరూరల్: తప్పిపోయి వచ్చిన ఓ బాలుడి ప్రకాశం బ్యారేజ్ ప్రాంతంలో సోమవారం పోలీసులు గుర్తించారు. ఆ బాలుడు ఎవరో కనుక్కునేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. బాలుడు బధిరుడని గుర్తించి మంగళగిరి తుళ్ళూరు, తాడికొండ, పోలీస్‌స్టేషన్లకు బాలుడి వివరాలు పంపించారు. సచివాలయ వలంటీర్ల ద్వారా విచారణ చేసి వెంకటపాలెంకు చెందిన తొట్టక సాంబశివరావు, లక్ష్మీదుర్గల కుమారుడైన తొత్తుక కార్తీక్‌గా గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన సాంబశివరావు, లక్ష్మీ దుర్గ బాబు బధిరుడని, మాట్లాడలేదని, వినపడదని వివరించారు. ఉదయం నుంచి కనిపించలేదని, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్దామనుకున్న తరుణంలో ఇక్కడ ఉన్నాడని సమాచారం రావడంతో వచ్చామని చెప్పారు.

ముగిసిన చంద్రశేఖరస్వామి ఆర్ద్రా మహోత్సవాలు

పెదకాకాని: మండల పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఐదు రోజులు నిర్వహిస్తున్న గంగాభ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామి వారి 81వ ఆర్ద్రా మహోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. చివరిరోజైన స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, భస్మాభిషేకం, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారికి పూజలు జరిపించారు. మూలవిరాట్‌కు రాజరాజేశ్వరిదేవిగా అలంకారం చేశారు. లక్ష బిల్వార్చన, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నామ సంకీర్తన, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, ఆంజనేయస్వామికి ఆకుపూజ జరిపించారు. స్వామివారికి గో క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారికి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఇటీవల జరిగిన నంది నాటకోత్సవాల్లో ఉత్తమ నాటక రచయితగా బంగారు నంది అందుకున్న తక్కెళ్లపాడు వాసి పిన్నమనేని మృత్యుంజయరావును కమిటీ సభ్యులు సత్కరించారు.

వర్సిటీలో రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహావిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిపాలనా భవన్‌లో ఏర్పాటు చేసిన నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాన్ని సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భం వీసీ మాట్లాడుతూ వర్సిటీ పాలన భవనానికి గతంలో రవీంద్రనాథ్ ఠాగూర్ పేరు పెట్టినట్లు వివరించారు. ఈ ప్రాంగణంలో నేడు ఆయన విగ్రహం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆసియాలో తొలి నోబెల్ బహుమతి పొందిన వ్యక్తిగా రవీంద్ర నాథ్ ఠాగూర్ నిలిచారని, ఆయనలోని కృషి, పట్టుదల ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ప్రమీల రాణి, ప్రొఫెసర్ సిద్దయ్య, ఈ శ్రీనివాస రెడ్డి, అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు, డాక్టర్ కె.అబ్రహం లింకన్, విగ్రహం రూపకర్త శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రవి శంకర్ రెడ్డి, ఇంజినీర్ కుమార్ రాజా, డీఈఈ కె.సుబ్బారావు, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రాము పాల్గొన్నారు.



రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలని కోరారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. స్పందన అర్జీల అప్ డేట్స్‌ని ప్రత్యేకంగా విభాగాధిపతులతో ఏర్పాటు చేసిన గ్రూప్‌లో పోస్ట్ చేసి, పరిష్కారాలపై సమీక్ష చేస్తామన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్.శ్రీనివాస్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

వివిధ సంఘాల క్యాలెండర్లు ఆవిష్కరణ

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మినిస్ట్రియల్ ఎంప్లాయీస్- 2024 నూతన సంవత్సర కాలెండర్‌ను సంపత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు సోమవారం ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు సంయుక్తంగా పని చేసి నగరాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలేశ్వరరావు, శివన్నారాయణ, హాజారు వెంకటేశ్వర రావు, ఖాజావాలి, రంగా రెడ్డి, రాజేష్, శివ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

వికాస క్యాలెండర్..

ఏఎన్‌యూ: వికాస(యూనివర్సిటీ అధ్యాపకేతర ఉద్యోగ సంఘం) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వికాస అధ్యక్షుడు టి.అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస రావు, కోశాధికారి ఆనంద్ పాల్గొన్నారు.

ఉద్యోగుల క్యాలెండర్..

గుంటూరు మెడికల్: క్షయ వ్యాధి నిర్మూలన కాంట్రాక్టు ఉద్యోగుల జిల్లా యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు ఆవిష్కరించారు. క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి.లక్ష్మానాయక్ మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా పనిచేసి జిల్లాను టీబీ లేని జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ నేతలు కె.రాంబాబు, వి.రాజశేఖర్, ఎస్.కె.చాందిని, నాగజ్యోతి, బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసమితి క్యాలెండర్..

గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవాసమితి నూతన క్యాలెండర్‌ను బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. చెమిటి గంటి రామకృష్ణశాస్త్రి రూపొందించిన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అధ్యక్షుడు రంగావఝల లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడు గొల్లపూడి రామకృష్ణారావు, కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు జి.వి.ఎల్.ఎన్.సంజీవరావు, నందిరాజు పాండురంగారావు, నల్లగొండ రాధ, మన్నవ దివాకర్ శర్మ, పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ కావటి



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం నేతలు

హరహరా.. మురహరా..



పెదకాకాని శివాలయం ధ్వజస్తంభం వద్ద భక్తుల రద్దీ



భ్రమరాంబ అమ్మవారు మల్లేశ్వర స్వామివారు

పెదకాకాని: స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. దేవాలయానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటితో పొంగళ్లు తయారు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు దీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏసీ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర రావు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో అధిక సంఖ్యలో అభిషేక పూజలు, అన్నప్రాసనలు, చెవిపోగులు, నామకరణలు, వాహన పూజలు, అంత్రాలయ దర్శనాలు జరిగాయి. ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల నిత్యకల్యాణం జరిపించారు.